క్లుప్తంగా

నాగారపమ్మ కొలుపుల్లో ఎమ్మెల్యే బుర్రా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

వెలిగండ్ల: మండల పరిధి ముసిలిపల్లిలో జరిగిన నాగారపమ్మ తల్లి కొలుపులో ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. జెడ్పీటీసీ గుంటక తిరుపతరెడ్డి, సొసైటీ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేను సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మ కొలుపులు

పామూరు: మండలంలోని తిరగలదిన్నెలో గ్రామదేవత నాగార్పమ్మ కొలుపులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొలుపుల సందర్భంగా అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించగా దేవస్థాన కమిటీ ఎమ్మెల్యే బుర్రాను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్ పిన్నిక రత్తయ్య, మానం వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

11న ప్రవేశ పరీక్ష

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డి పాలెం ఏపీ మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌కే హష్తార్ సోమవారం తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాత్రమే ఆదివారం ఉదయం 8 గంటలకు మోడల్‌స్కూల్‌వద్దకు చేరుకుని హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సామగ్రిని తీసుకురావాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేయని విద్యార్థులను అనుమతించమన్నారు.

పొన్నలూరు ఎంపీడీఓగా కల్పన



కల్పన, ఎంపీడీఓ

పొన్నలూరు: మండలం నూతన ఎంపీడీఓగా బి.కల్పన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన రత్నజ్యోతి టంగుటూరు బదిలీ కావడంతో ఆమె స్థానంలో నెల్లూరు జిల్లాలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న కల్పనను పదోన్నతిపై పొన్నలూరుకు నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

జాబ్ కార్డున్న కూలీకే పని కల్పించాలి

హనుమంతునిపాడు: జాబ్ కార్డున్న ప్రతి కూలీకి పని లేదనకుండా కల్పించాలని ఏపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని హాజీపురంలో 20 గ్రూపులతో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పరిశీలించారు. ఇచ్చిన కొలతలు చేస్తేనే గిట్టుబాటు కూలి వస్తుందన్నారు. ఇచ్చిన కొలతలు తప్పకుండా చేయాలని, పని కావాలని ముందుగా కూలీలు డిమాండ్ నోటీసు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులరెడ్డి బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసులరెడ్డి

పీసీపల్లి: ఎంపీడీఓగా శ్రీనివాసులరెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల, ప్రజల సమన్వయంతో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆరుగురు జాదరులు అరెస్టు

పొన్నలూరు: మండలంలోని వెల్లటూరు గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.5230 నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై దాసరి రాజారావు తెలిపారు.

1642 బేళ్లు విక్రయం

కందుకూరు: పొగాకు వేలం జోరుగా సాగుతుంది. పొగాకు రేట్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. సోమవారం జరిగిన వేలంలో అత్యధిక రేట్లు నమోదయ్యాయి. కందుకూరు–1 పొగాకు వేలం కేంద్రంలో 871 బేళ్లను వేలానికి ఉంచగా 826 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 912 బేళ్లకు గాను 816 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లోను అత్యధిక ధర రూ.208 నమోదు కాగా, కనిష్ట ధరలు వరుసగా రూ.163, రూ.161 వచ్చాయి. నిన్నటి వరకు రూ.200 ఉన్న ధర ఒక్కసారిగా రూ.208 వరకు ఎగబాకింది. దీంతో సరాసరి ధరలు కూడా రూ.202 వరకు నమోదయ్యాయి.

వలంటీర్లకు మంచి భవిష్యత్

- చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- టీడీపీ హయాంలో దోచుకోవడం.. దాచుకోవడమే
- వలంటీర్లు మరింత సేవా దృక్పథంతో పనిచేయాలి
- సంక్షేమ పథకాలతో దేశంలోనే ఏపీ ఆదర్శంగా నిలిచింది
- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి వలంటీర్లకు వందనం కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే మొదటి బాణం వలంటీర్ల వ్యవస్థమీదే పడుతుందని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 28 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నాలుగేళ్ల పాలనలో అన్ని రంగాల్లో ప్రభుత్వం ముందడుగులో ఉందన్నారు. వలంటీర్ల వ్యవస్థతో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు మరింత సేవా దృక్పథంతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఆల్ ఫ్రీ బాబును ప్రజలు నమ్మరు..

ప్రజలను మోసం చేయడానికి ఆల్ ఫ్రీ చంద్రబాబు కాపీ కొట్టి కొత్త మేనిఫెస్టోతో డ్రామాకు తెరలేపాడని బుర్రా తీవ్రంగా దుయ్యబట్టారు. నిన్నటి దాక ప్రభుత్వ పథకాలన్నింటిపై విషం కక్కిన చంద్రబాబు కొత్త పథకాల పేరుతో ప్రజలకు బురిడి కొడుతున్నారని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు మోసపు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. టీడీపీ హయాంలో దోచుకో.. దాచుకో.. పంచుకో తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. చంద్రబాబు ఎన్ని వాగ్దానాలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ డి ప్రకాశం, వైస్ చైర్మన్‌లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, ఏపీ ఎంసీ మెంబర్ పెరుగు మురళీ, చింతం గుంట్ల సాల్మన్, శ్రీ రాం సతీష్, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, తమ్మినేని సుజాత, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, పసుపులేటి దీప, దేవకి సత్యావతి, దేవకి రాజీవ్, దేవరాజ్, దాసరి మురళీ, జిలాని, జానీ, డాక్టర్ రసూల్, తిరుపతయ్య, ఎస్‌కే షఫీ, పోతిరెడ్డి రాజారెడ్డి, నక్కా రామకృష్ణా, ఖాజా,అబ్రహం లింకన్, ఎస్‌కే పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, మీరావలి, చింతం శ్రీను, శ్రీహరిరెడ్డి, కిషోర్, రాజేష్, నాగూర్‌బీ, నల్లబాల రత్తమ్మ, సదా, మీరావలి , సయ్యద్ నాయబ్ రసూల్, డీ చెంచులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

జగనన్నకు చెబుదాం స్పందనకు 8 అర్జీలు



ఉలవపాడులో జగనన్నకు చెబుదాంలో అర్జీల స్వీకరణ

లింగసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి 7 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టి.ప్రసాద్, ఎంపీడీఓ శేషుబాబు చెప్పారు. స్పందనలో రెవెన్యూకు సంబంధించి 6 అర్జీలు, పొదుపు గ్రూపుకు ఆసరా పడలేదని ముత్యాలపాడు గ్రామానికి చెందిన పొదుపు మహిళలు విన్నవించారు. వచ్చిన అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ సంయుక్తంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పొలం ఆన్‌లైన్ చేయాలని, ఇంటి కొలతల కోసం అర్జీలు వచ్చాయన్నారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రెండు అర్జీలు వచ్చాయి. కరేడు గ్రామానికి చెందిన బొడ్డు గోపాల్ తన భూమి సమస్యల పరిష్కరించాలని అర్జీ ఇచ్చారు. భీమవరం గ్రామానికి చెందిన లేళ్లపల్లి వేణుగోపాల్ తన భూమిని ఆన్‌లైన్ చేయాలని అర్జీ ఇచ్చారు. వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు.

గుడ్లూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సూర్యనారాయణసింగ్ తెలిపారు. వచ్చిన అర్జీల్లో పోర్టు ఏర్పాటు వల్ల భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, భూముల రిజిస్ట్రేషన్ కోసం మరో అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ చంద్రసేన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు



విద్యార్థికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న హుసేన్‌రెడ్డి, నాయకులు

పామూరు: రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమపథకాలు, నూతన విద్యావిధానంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన రాగిపిండి నవీన్ 563 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమస్థానం సాధించాడు. ఈసందర్భంగా సోమవారం పాఠశాల హెచ్‌యం దేవిరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి రూ.5 వేలు, పార్టీ నాయకులు మరో రూ.17 వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, విదేశీవిద్య మొదలైన పథకాలు పేదల చదువులకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. స్థానిక చర్చిప్రాంగణలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సామాఖ్య నాయకులు రాచూరి ఏలియా ఇంటర్మీడియట్‌లో ప్రతిభకనబరిచిన గంధం మరియమ్మకు రూ.10 వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాల అంకిరెడ్డి, వైస్ చైర్మన్ కుమారి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బుర్రా



హనుమంతునిపాడులో మొక్కలు నాటుతున్న అధికారులు

కనిగిరి రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్క నాటి వాతవరణ కాలుష్య నివారణలో భాగస్వామ్యులు కావాలన్నారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, సీహెచ్ సాల్మన్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఉద్యాన కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్‌ఎస్ విజయపద్మ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి యోహాన్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మొక్కలను నాటి వాటి సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ జీవీ కృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయం, సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం కాలుష్యం కాకుండా కాపాడటం మనందరి బాధ్యతన్నారు. ఎంపీడీఓ క్రిష్ణారావు, కార్యదర్శి ఆచారి, జె.కోటేశ్వరావు, మధుసూదన్‌రెడ్డి, కొండారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పామూరులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓ



క్విజ్ పోటీల విజేతలతో డీన్ డాక్టర్ విజయపద్మ

పామూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ మిడసల జ్వాలా నరసింహం, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మండల కార్యాలయం ఆవరణలో ఫారెస్ట్, స్వచ్ఛందసేవాసంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడంద్వారా పర్యావరణ సమతుల్యతతో భవిష్యత్ తరాలవారు ఆరోగ్యంగా జీవించగలరన్నారు. డీఆర్‌ఓ ఎ.వెంకట సుబ్బయ్య, ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాల్ రాజు, రోజారమణి పాల్గొన్నారు.



సీఎస్‌పురంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సీఎస్‌పురం(పీసీపల్లి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, చెన్నపునాయునిపల్లి అంగన్‌వాడీ పాఠశాలలో రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం అధికారులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ మధవరావు, ఎఫ్‌ఎస్‌ఓ అలీం, పంచాయతీ కార్యదర్శులు రామ్‌ప్రసాద్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

స్పందనకు 9 అర్జీలు

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 9 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ మనోహర్ తెలిపారు. వ్యక్తిగత సమస్యలపై 9 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతి సోమవారం జరిగే స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మున్సిపాలిటీ, పారిశుధ్య సమస్యలతో పాటు, ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు 9177700267 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బావిని పునరుద్ధరించాలి

పట్టణంలోని పెద్దబజార్‌లోని పురాతన బావిని పునరుద్ధరించాలని స్థానికులు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పురాతన బావిలో రెండేళ్ల క్రితం ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని, ఆ తరువాత బావి నిరుపయోగం మారిందన్నారు. ఈ బావిలోని నీటిని తోడేసి పూడిక తీసి క్లీన్ చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కలిసి అర్జీలు ఇచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. పురాతన కాలం నుంచి ఎంతో మంది నీటి అవసరాలకు ఈ బావి ఆధారంగా ఉందని, మరమ్మతులు చేసి రక్షణ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. కార్యక్రమంలో స్థానికులు ఇస్కాల సురేంద్ర, పబ్బిశెట్టి వరదరాజు, నల్లమల్లి ప్రసాద్, పద్మనాభుని శ్రీనివాసులు, చెన్నా రామాంజనేయులు, బోణాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల



అంకాలమ్మ తల్లికి భక్తులు ఏర్పాటు చేసి కుంకుమ బండ్లు

హనుమంతునిపాడు: మండలంలోని దాసళ్లపల్లిలో దోమలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. సోమవారం కోలాటం, పాటకచేరి, కొర్లబండి కార్యక్రమం, ప్రత్యేక పొంగళ్లు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు చెల్లించారు. భక్తులు కుంకుమ బండ్లు, పూసల బండ్లు ఏర్పాటు చేసి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కుంకుమ బండ్లను అంకాలమ్మ దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

పీసీపల్లి: మండలంలోని పెదయిర్లపాడులో అంకాలమ్మ తల్లి తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అంకమ్మతల్లికి అంకసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాళమ్మ తల్లిను సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ప్రజలు భారీగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 7న ఎండ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొండపి: జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో పోలేరమ్మ దేవస్థానం వార్షిక తిరునాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ కట్టాలి

గుడ్లూరు: ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కోసం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నగదు కట్టాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు అవసరమైన పుస్తకాలను ప్రభుత్వమే అందిస్తున్నందున వాటిని కొనుగోలు చేయాలన్నారు. ముందుగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు అవసరమైన పుస్తకాల కొరకు 5 శాతం ఇండెంట్ డీడీలు తీసి పంపించాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి పుస్తకాలను సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ఖోఖో పోటీలు



గ్రంథాలయంలో ఖోఖో ఆటల పోటీలు

ఉలవపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల మానసిక ఆనందం కోసం ఆటల పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో జాతీయనాయకుల జీవిత చరిత్రలు చదివించారు. పుస్తకపఠనం చేయించిన తరువాత ప్రధాన పాయింట్లను రాయించారు. విరివిగా పుస్తకాలు చదవాలని తెలిపారు. ఖోఖో పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందచేయనున్నట్లు గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు తెలిపారు.

పెట్లూరులో శిలాఫలకాలు ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకాలను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

కొండపి: మండలంలోని పెట్లూరు గ్రామంలో కొత్తచెరువు, ఊరచెరువు వద్ద ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టినట్లు సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మహాలక్ష్మి తెలిపారు. ఏపీఓ కథనం మేరకు.. పెట్లూరులో ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో కొత్తచెరువు, ఊరచెరువుల్లో పలు అభివృద్ధి పనులు చేశారు. వాటికి సంబంధించి ఉపాధి హామీ నిధులతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. శిలాఫలకాలను పరిశీలించడానికి ఏపీడీ వెంకటస్వామి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మహాలక్ష్మీ, వెళ్లగా అవి ధ్వంసమై ఉన్నాయి. ఏపీడీ ఆదేశాల మేరకు కొండపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏపీఓ తెలిపారు.

పేదల పక్షపాతి వెంకటేశ్వర్లు

పామూరు: సీపీఎం సీనియర్ నాయకుడు మండ్లా వెంకటేశ్వర్లు పేదల పక్షపాతి అని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం సాయంత్రం మండ్లా వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల పక్షపాతిగా, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన పనిచేశారన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం నాయకులు విఠల్‌రావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, మాధవ, క్రిష్ణ, నాయబ్, సుభాని, పి.శ్రీను పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీయం నాయకులు

349 మంది రైతులకు పట్టాల పంపిణీ



పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ నాగార్జునరెడ్డి

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని జెడ్పీటీసీ గుంటక తిరుపతరెడ్డి అన్నారు. చుక్కల భూములను సెటిల్మెంట్ భూములగా గుర్తింపు తెస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రైతులకు పట్టాల పంపిణీ చేశారు. మండలంలో 1529 ఎకరాలు చుక్కల భూములుండగా 349 మంది రైతులకు పట్టాల అందజేశామన్నారు. తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వీఆర్వో జెమ్స్, వైఎస్సార్ సీపీ నాయకులు వై.నాగూర్‌యాదవ్, బొబ్బ వెంకటరెడ్డి పాల్గొన్నారు.